క్లుప్తంగా

ఓవర్‌లోడ్‌తో వెళ్లే వాహనాలను నిషేధించాలి

పంచాయతీ కార్యదర్శికి
ఆటో యూనియన్ సభ్యుల వినతి



మంబాపూర్ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

పెద్దేముల్: ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్, ట్రాక్టర్లను నిషేధించాలని ఆటో యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు మంబాపూర్ పంచాయతీ కార్యదర్శి సంజీవన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని రేగొండి శివారులో క్రషర్ మిషన్ నుంచి డస్టను టిప్పర్, ట్రాక్టర్లు ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారు. దీంతో మంబాపూర్ మలుపు వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గతంలోనూ సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని కోరారు. పెద్దేముల్ ఠాణాలోనూ ఫిర్యాదు చేస్తామని ఆటో యూనియన్ సభ్యులు వెల్లడించారు.

ప్రణాళిక ప్రకారం హామీల అమలు

కుల్కచర్ల పీఏసీఎస్
వైస్ చైర్మన్ నాగరాజు



లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్స్ అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తుందని కుల్కచర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చాకల్‌పల్లిలో లబ్ధిదారులకు గ్యాస్ ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాల ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేద ప్రజల ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో చాకల్‌పల్లి మాజీ సర్పంచ్ రాములమ్మశేఖర్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాము, నాయకులు వెంకటయ్య, సలీం, రామ్మోహన్ శర్మ, చంద్రశేఖర్, రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పదిలో ఉత్తీర్ణత శాతం పెంచాలి

కేజీబీవీని ఆకస్మికంగా
తనిఖీ చేసిన ఎంఈఓ



ధారూరు కేజీబీవీలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ధారూరు: మండల కేంద్రంలోని కేజీబీవీని మంగళవారం మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలిచ్చారు. విద్యార్థినుల హాజరు, డీఎస్ఈ, ఎఫ్ఆర్ఎస్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతర ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం అన్ని పాఠశాలల కంటే ఎక్కువగా ఉండాలని.. ఇందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులను గ్రూపులుగా విభజించి అభ్యాసన స్థాయికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థినుల భోజనం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని.. మెనూ ఖచ్చితంగా పాటించాలని ఇన్‌చార్జి ఎస్ఓకు సూచించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలయ్యాయని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ పట్టణ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పరిపాలన కొనసాగిస్తున్నాయని ఆరోపించారు.



మోమిన్‌పేట: ఎంపీడీఓ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న మండల పరిషత్ ఉద్యోగులు



మోమిన్‌పేట: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెవెన్యూ ఉద్యోగులు

అధికారులపై దాడులు అమానుషం

నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసిన మండల పరిషత్, రెవెన్యూ ఉద్యోగులు

జిల్లా మెజిస్ట్రేట్‌గా అత్యున్నత పోస్టులో ఉన్న కలెక్టర్‌పైనే దాడికి దిగితే కింది స్థాయి ఉద్యోగులమైన తమ పరిస్థితి ఏమిటని జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల పరిషత్ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులు ప్రశ్నించారు. ఈ మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలిపారు. సోమవారం దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా కంపెనీ భూసేకరణలో ప్రజాభిప్రాయ సేకరణలో రైతులు కలెక్టర్‌తో పాటుగా ఇతర జిల్లా అధికారులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. కారు అద్దాలు ధ్వంసం చేసి భీకర వాతావరణం సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



పరిగి: మున్సిపల్ కార్యాలయం ఎదుట అధికారులు



మర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజమల్లయ్య, సిబ్బంది



తాండూరు టౌన్: మున్సిపల్ కార్యాలయం ఎదుట..



పెద్దేముల్: మండల పరిషత్ కార్యాలయంలో..



పూడూరు: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు



తాండూరు రూరల్: వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద ఉద్యోగులు



బంట్వారం: కోట్‌పల్లిలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది



బంట్వారం: ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది

ఉపాధ్యాయ హక్కులకు నిరంతర పోరాటం

బషీరాబాద్: ఉపాధ్యాయుల సంక్షేమం, హక్కుల కోసం పీఆర్టీయూటీఎస్ నిరంతర పోరాటం చేస్తోందని సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట్రామ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జీవన్గిలో ఇటీవల ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వారిచే సభ్యత్వం చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకే పీఆర్టీయూ ఆవిష్కృతమైంది అన్నారు. త్వరలోనే ఏకీకృత సర్వీసు నిబంధనలను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, రవికాంత్, మండల శాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై పోలీసు పికెటింగ్

ఇంటర్నెట్ సేవలు బంద్

బొంరాస్‌పేట: ఫార్మా భూసేకరణకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో జరిగిన ఘటనకు పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం జాతీయ రహదారిపై భారీగా బందోబస్తు నిర్వహించారు. మండలంలోని తుంకిమెట్ల వద్ద తెల్లావరు జాము నుంచి పోలీస్ పికెటింగ్ నిర్వహించారు. కొడంగల్, ఫార్మా గ్రామాలకు రాకపోకలపై ప్రత్యేక నిఘా ఉంచారు. సాంకేతిక, సోషల్ మీడియా సమాచారాలు లేకుండా ఉదయం నుంచి ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు.

భాధిత కుటుంబానికి ఆపన్నహస్తం

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు నర్సింలుగౌడ్ ఇల్లు దగ్ధమైన విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ప్రకాశ్ వారికి కుటుంబానికి అండగా నిలిచారు. ఇంట్లోని సామగ్రి కాలిబూడిదైన విషయం తెలుసుకున్న ఆయన దుస్తులు, కిరాణం, వంట సామగ్రి బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ.. ఆపదలో తమ వంతుగా సాయం చేయాలనే ఉద్దేశంతో నిత్యావసరాలు అందజేశామన్నారు.

ఎన్యుమరేటర్లకు కొత్త చిక్కులు

మధ్యాహ్నం ఇళ్లకు తాళాలు

- ఒక్కొక్కరికి 250 నుంచి 300 కుటుంబాల వరకు కేటాయింపు
- 150 కుటుంబాలు దాటితే మరో ఎన్యుమరేటర్‌ను నియమించాలని పీఆర్టీయూ డిమాండ్



దోర్నాల్‌లో ఎన్యుమరేటర్ సర్వేకు వెళ్లగా తాళం వేసిన ఇల్లు

ధారూరు: సమగ్ర కుటుంబ సర్వే ఎన్యుమరేటర్లకు కొత్త చిక్కులు తెచ్చిపెడుతోంది. మంగళవారం ఎన్యుమరేటర్లు సర్వేకు వెళ్లగా ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో చేసేదేమీలేక వెనుదిరిగారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉదయం పాఠశాలకు వెళ్లి మధ్యాహ్నం నుంచి సర్వేకు వెళ్లాలని సర్కార్ సూచించింది. సర్వేకు వెళ్లే వరకు ఇంటి వద్ద ఉంటున్న చిన్నారులు తమ కుటుంబ సభ్యులు పొలాలకు వెళ్లారని సమాధానం ఇస్తున్నారని.. ఇలా అయితే గడువులోగా సర్వే పూర్తి చేయలేమని ఎన్యుమరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150 కుటుంబాలు కేటాయించాల్సి ఉండగా ఇళ్లను గుర్తించి స్టిక్కర్లు వేయడానికి వెళ్లినప్పుడు 300 వరకు పెరిగాయని ఆవేదన చెందారు. కుటుంబాల సంఖ్య పెరగడం, మధ్యాహ్నం సర్వేకు వెళ్లగా ఇళ్ల వద్ద రైతులు, ప్రజలు ఉండటం లేదని వారు వాపోయారు.

గడువు పొడగించాలి: పీఆర్టీయూ

ప్రతీ ఎన్యుమరేటర్‌కు 150 కుటుంబాలే కేటాయించాలనీ, ఎక్కువ కుటుంబాలు ఉంటే మరో ఎన్యుమరేటర్‌ను నియమించాల్సి ఉంటుందని పీఆర్టీయూ ధారూరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం పేర్కొన్నారు. ప్రస్తుతం తమ పనులు మానుకుని ఉదయం 6 గంటల వరకే గ్రామాలకు వెళ్లి 9 గంటల వరకు, సాయంత్రం నుంచి రాత్రి 8 గంటల వరకు సర్వే చేసి ఇళ్లకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్యుమరేటర్లకు పనిభారం ఎక్కువయిందని సర్వే గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

ఆలు సాగు.. ఇదే అదును

- 90–110 రోజుల్లోనే పంట కోత
- యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు
- మండల ఉద్యాన శాఖ అధికారి గఫూర్





మోమిన్‌పేటలో సాగు చేసిన ఆలు

మోమిన్‌పేట: కూరగాయ సాగులో అతి తక్కువ కాల పరిమితిలో కోతకు వచ్చేది ఆలు పంట మాత్రమే. విత్తిన 90 రోజుల నుంచి 110రోజులలో పంట కోతకు వస్తుంది. ఎక్కువ మంది రైతులు 70 రోజులకే మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఆలు సాగుకు శీతాకాలం అనువైన కాలం. చలి తీవ్రత ఎంత ఎక్కువగా ఉంటే దిగుబడి అంత ఆశాజనకంగా ఉంటుందని మండల ఉద్యానశాఖ అధికారి గఫూర్ తెలిపారు. మండల పరిధిలోని కోల్కుంద, మోమిన్‌పేట, రావులపల్లి, ఎన్కతల, సయ్యద్‌అల్లిపూర్ గ్రామాలలో ఆలును విరివిగా సాగు చేస్తున్నారు. సరియైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారులు వెల్లడిస్తున్నారు. కుఫ్రి పుకరాజ్(166), కుఫ్రి కృథి, కుఫ్రి మోహన్ (302)లాంటి విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవాలి. భూమిని రెండు నుంచి మూడు సార్లు లోతుగా కలియదున్నుకోవాలి. బాగా మాగిన సేంద్రియ ఎరువులను ఎకరాకు 12 టన్నుల చొప్పున ఆఖరి దుక్కిలో వేసుకోని కలియదున్నుకోవాలి. కొంత మంది రైతులు పచ్చి రొట్ట ఎరువులైన జీనుగ, జనుములను సాగు చేసి ఏపుగా పెరిగిన తర్వాత కలియ దున్ని ఆలు సాగు చేపడుతున్నారు.

ఎకరాకు ఏడు క్వింటాళ్ల విత్తనం

ఎకరాకు ఏడు క్వింటాళ్ల విత్తనం సరిపోతుంది. బోదెలను ఏర్పాటు చేసుకుని విత్తుకోవాలి. ఎరువుల యాజమాన్యం పాటించి డ్రిప్ ద్వారా నీటిని అందించాలి. ఆలు తేలుతున్న సమయంలో మట్టితో కప్పాలి, లేదంటే పచ్చగా మారుతుంది. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. విత్తుకొన్న 90రోజుల నుంచి 110రోజులలో పంట కోతకు వస్తుంది. అప్పుడే మార్కెటుకు తరలించాలి. ఎకరాకు 9 నుంచి 15టన్నుల వరకు దిగుబడులు వస్తాయి.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

విత్తనం క్వింటాల్‌కు రూ.3,600 నుంచి 4వేల వరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎక్కువ మంది రైతులు పెట్టుబడి అధికం కావడం వలన సాగుకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే అధిక సంఖ్యలో రైతులు ఆలు సాగుకు ముందుకు వస్తారు. విత్తనాన్ని ఆగ్రా నుంచి తీసుకు వచ్చేందుకు అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుందని ప్రభుత్వం విత్తన రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

దాడుల వెనుక కుట్ర'కారు'లు

కలెక్టర్‌పై దాడి ఘటనలో బీఆర్ఎస్ నేతలున్నారని ఆరోపణలు

- బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి
- డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య

కుల్కచర్ల: ఫార్మా భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన జిల్లా అధికారులపై దాడి వెనుక కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతల పాత్ర ఉందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య ఆరోపించారు. మంగళవారం వారు మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీంరెడ్డి, మొగులయ్య మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు ప్రభుత్వాలకు వారధులు మాత్రమేనని.. కానీ వారిపై కొందరు పనిగట్టుకుని దాడులు చేయించడం హేయనీయమన్నారు. కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులపై దాడులు చేయడం రాష్ట్ర చరిత్రలో చీకటి రోజుగా భావిస్తున్నామన్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా అధికారులకు క్షమాపణ చెప్పాలని లేదంటే పార్టీ శ్రేణులు తగిన బుద్ధి చెబుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్–బి అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు నరసింహ నాయక్, మాజీ ఎంపీపీ అంజిలయ్య, నాయకులు కృష్ణయ్య, రవి, సాయన్న, జలీల్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

సజావుగా సమగ్ర కుటుంబ సర్వే

ఎంపీడీఓ విశ్వప్రసాద్



తాండూరు రూరల్: గోనూర్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న విశ్వప్రసాద్

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే సజావుగా సాగుతోందని ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని గోనూర్‌లో సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. 33 గ్రామ పంచాయతీల్లో 106 మంది ఎన్యుమరేటర్లతో సర్వే కొనసాగుతోందన్నారు. మండల వ్యాప్తంగా 14,733 కుటుంబాలున్నట్లు గుర్తించగా.. సర్వే పూర్తయ్యే నాటికి పెరిగే అవకాశం ఉందన్నారు. మంగళవారం నాటికి 3,410 కుటుంబాల సర్వే పూర్తయిందన్నారు. ఆయన వెంటన పంచాయతీ కార్యదర్శి రషీద్, గ్రామస్తులు ఉన్నారు.

పకడ్బందీగా సర్వే

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలో ముమ్మరంగా సాగుతోంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్ళి వివరాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లో సర్వే తీరును మండల అధికారులు ఏపీఎం సాయన్న పరిశీలించారు.

పుట్టిన ఊరికి రుణపడి ఉంటా

ఇంద్రారెడ్డి చారిటబుల్
ట్రస్ట్ చైర్మన్ నర్సింహారెడ్డి



మహిపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నర్సింహారెడ్డి తదితరులు

తాండూరు రూరల్: తనకు జన్మనిచ్చిన కోటబాసుపల్లి గ్రామానికి రుణపడి ఉంటానని మాజీ మంత్రి సబితారెడ్డి సోదరుడు, ఇంద్రారెడ్డి చారిటుబుల్ ట్రస్ట్ చైర్మన్ గొట్టిక నర్సింహారెడ్డి(బాబు) అన్నారు. మంగళవారం ఆయన గ్రామంలో నిర్వహించిన తన తండ్రి, మాజీ ఎంపీపీ గొట్టిగ మహిపాల్‌రెడ్డి వర్ధంతిలో పాల్గొన్నారు. మహిపాల్‌రెడ్డి సమాధికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కోటబాసుపల్లి ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేసతానన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిక రాంరెడ్డి, గొట్టిక రాజశేఖర్‌రెడ్డి, బురానొద్దీన్, గౌసుద్దీన్, వీవీ రెడ్డి, పోలీస్ వెంకటయ్య, నర్సింలు, రాములు, సురేశ్, నరేందర్, రవి, నర్సింలుగౌడ్, సూరి, ఉపాధ్యాయులు నాగప్ప, నర్సింహారెడ్డి, కిష్టప్ప పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వినతి

షాద్‌నగర్‌రూల్: గ్రామ పంచాయతీ కార్మికులను దూషించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన క్యాదర్శి జంగయ్య మాట్లాడుతూ.. జిల్లేడ్ చౌదరిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న పాండు రంగాగౌడ్ జీపీ కార్మికులను కులం పేరుతో ధూషిస్తున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు మాత్రమే జీపీ కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. వారిని కార్యదర్శి కులం పేరుతో దూషించడం సరికాదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ఘటనపై విచారణ చేయించి మీకు న్యాయం చేస్తానని హామీనిచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో జీపీ కార్మికులు ఉన్నారు.